క్లుప్తంగా

పాఠశాలలో వాటర్ ఫిల్టర్ ఏర్పాటు



వాటర్ ఫిల్టర్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

కందుకూరు: మండల పరిధిలోని లేమూరు జిల్లా పరిషత్ పాఠశాలలో కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ నిర్వాహకుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం రూ.3.50 లక్షలతో వాటర్ ఫిల్టర్‌ను ఏర్పాటు చేయించారు. దీనిని మాజీ సర్పంచులు గూడూరు కొండల్‌రెడ్డి, ఢిల్లీ గణేష్, ఎంతఊట నర్సింహ, గ్రామ ప్రత్యేకాధికారి సంధ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులకు శుద్ధి చేసిన తాగునీటిని అందించడానికి ముందుకు వచ్చిన నిర్వాహకుడ్ని అభినందించారు. చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నర్సింహ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, గ్రామస్తులు గుల్వి జైపాల్, రఘు, ఢిల్లీ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కరాటే నేర్చుకోవడం హర్షణీయం



కరాటే బెల్ట్, పత్రాలు అందజేస్తున్న మాజీ కౌన్సిలర్ రవినాయక్

తుక్కుగూడ: విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న రంగంలో రాణించాలని తుక్కుగూడ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ బాదావత్ రవినాయక్ సూచించారు. బుధవారం పురపాలక కేంద్రంలోని బ్రిలియంట్ పాఠశాల విద్యార్థులకు నాయక్ బుడాఖాన్ అకాడమీ ఆధ్వర్యంలో కరాటే పోటీలు నిర్వహించి, ప్రతాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కరాటే నేర్చుకోవడంలో ఆసక్తి చూపడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ రవీందర్, పాఠశాల సిబ్బంది శ్రీధర్‌రెడ్డి, శివనాయక్, నరేష్‌నాయక్, రాజు, తరుణ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీకి తరలిన బీసీ నేతలు



బీసీల పోరు గర్జన మహాధర్నాకు తరలిన నాయకులు

కందుకూరు: ఢిల్లీలో బీసీల పోరు గర్జన మహాధర్నాకు మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి సూచనల మేరకు మహేశ్వరం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ బీసీ నాయకులు తరలివెళ్లారు. అందులో ధన్‌రాజ్‌గౌడ్, పి.వెంకటేష్‌గౌడ్, ఎం.అజయ్‌కుమార్, ఊట రాజు, రాఘవ, యాదయ్య, చేగూరి రమేష్, శివ, టి.శ్రీనివాస్, మహేష్ యాదవ్, జితేందర్‌గౌడ్, సతీష్ తదితరులు మహాధర్నాలో పాల్గొన్నారు.

నేదునూరు నుంచి..

కాగా బీసీల పోరు గర్జనకు మండల పరిధిలోని నేదునూరు నుంచి వివిధ పార్టీలకు చెందిన బీసీ నాయకులు ఇంద్రకంటి రవీందర్‌గౌడ్, నరహరి, భిక్షపతి, సాటు మైసయ్య, శ్రీశైలం, సాయి, సిద్ధూ, మహేందర్, బుచ్చయ్య, శివరాజు తదితరులు తరలివెళ్లి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



తాగునీరు పంపిణీ చేస్తున్న కాలనీ సభ్యులు

హుడాకాంప్లెక్స్: చలివేంద్రాలు బాటసారుల దాహార్తిని తీర్చడానికి ఎంతగానో దోహదపడతాయని సరూర్‌నగర్ డివిజన్ వెంకటేశ్వర కాలనీ అధ్యక్షుడు గండు ధనంరెడ్డి తెలిపారు. బుధవారం కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం, మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని కాలనీ అసోసియేషన్ సభ్యులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఉపాధ్యక్షుడు మారోజు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కనకరావు, కోశాధికారి సాయికిరణ్, శాంతిప్రసాద్, మాధవరెడ్డి, బాలరాజ్‌గుప్తా, సుధాకర్, నరేష్, కిరణ్, రవికుమార్, సాయికృష్ణ పాల్గొన్నారు.

ముగిసిన పది పరీక్షలు

షాద్‌నగర్: పదో తరగతి వార్షిక పరీక్షలు ముగిశాయి. విద్యాశాఖ అధికారులు పక్కా ప్రణాళికతో ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలను పకడ్బందీగా నిర్వహించారు. బుధవారం నిర్వహించిన సాంఘీక శాస్త్రం పరీక్షకు మొత్తం 2,472 మంది విద్యార్థులకు గాను 2,464 మంది విద్యార్థులు హాజరయ్యారు. 8 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు మండల విద్యాధికారి మనోహర్ తెలిపారు.



బాలాపూర్‌లో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



నాదర్‌గుల్‌లో బీజేపీ శ్రేణులు

‘సన్నాల ఘనత మాదే’..

- జోరుగా కాంగ్రెస్, బీజేపీల ప్రచారం
- పోటాపోటీగా లబ్ధిదారులకు పంపిణీ
- రేషన్ దుకాణాల వద్ద సందడి

బడంగ్‌పేట్: సన్నబియ్యం పంపిణీ ఘనత మాదంటే మాదేనంటూ కాంగ్రెస్, బీజేపీ నాయకులు పోటాపోటీగా ప్రచారం చేస్తున్నారు. రేషన్ దుకాణాల వద్ద సందడి చేస్తూ ఆహార భద్రత కార్డు దారులకు బియ్యం అందజేస్తున్నారు. సంబురాలు చేసుకుంటూ.. సీఎం రేవంత్‌రెడ్డి, ప్రధాని మోదీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్నారు.

హామీ నిలబెట్టుకున్నాం.. కాంగ్రెస్

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టాం. అనుకున్న ప్రకారంగా ఉగాది నుంచి తెల్లకార్డు ఉన్న వారికి బియ్యం అందజేస్తున్నామని కాంగ్రెస్ నాయకులు సంబురాలు చేసుకుంటున్నారు. ముఖ్యమంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్నారు. చౌక ధరల దుకాణాలకు వెళ్లి.. బియ్య పంపిణీ చేస్తున్నారు. తెలంగాణలో పేదలకు సన్న బియ్యం ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని పేర్కొంటున్నారు.

ఈ ఘనత బీజేపీదే..

పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందని బీజేపీ శ్రేణులు చెప్పుకొంటున్నారు. ఉచిత బియ్యం అందజేతలో 90శాతం కేంద్రానిదేనని పేర్కొంటున్నారు. అందుబాటులో ఉన్న రేషన్ దుకాణాలకు వెళ్లి అర్హులకు బియ్యం పంపిణీ చేస్తున్నారు. పేదల ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని 'ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన' పథకం కింద పేదలకు కేంద్రం సరఫరా చేస్తుందని ప్రచారం చేస్తున్నారు. మోదీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్నారు.

అక్కడ ఎందుకు ఇవ్వటం లేదు: కాంగ్రెస్

తినే తిండి నుంచి ప్రతి వస్తువుకు పన్ను విధిస్తున్న కేంద్రం.. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సన్న బియ్యం ఎందుకు పంపిణీ చేయడం లేదని కాంగ్రెస్ శ్రేణులు ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి ఎక్కడ మంచి పేరు వస్తుందోనని, తప్పుడు ప్రచారం చేస్తూ.. రేషన్ లబ్ధిదారులను తప్పుదోవ పట్టిస్తున్నారని బీజేపీపై మండిపడుతున్నారు.

ఫొటో పంచాయితీ

ప్రతి కుటుంబానికి 6 కిలోలు అందిస్తున్న రేషన్ బియ్యంలో 5 కిలోలు కేంద్రమే భరిస్తుందని, అందుకే అన్ని రేషన్ దుకాణాల్లో ముఖ్యమంత్రి చిత్రపటం ఎలా ఉంచారో, అలాగే ప్రధాని ఫొటోను పెట్టాలని బీజేపీ శ్రేణులు పట్టుబడుతుండగా.. రాష్ట్ర ప్రభుత్వానికి వస్తున్న ప్రజాదరణను చూసి బీజేపీ ఓర్వలేక పోతుందని కాంగ్రెస్ నాయకులు విమర్శిస్తున్నారు.

పొత్తు కుదరకే? క్రెడిట్ తండ్లాట!

సెంట్రల్ ట్యాక్స్, స్టేట్ ట్యాక్స్ అని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని వర్గాల ప్రజల నుంచి క్రయవిక్రయాల పన్నును మూడో కంటికి తెలియకుండా వసూలు చేస్తున్న సంగతి తెలిసిందే. అందులో నుంచి పేదల కోసం ఇరు ప్రభుత్వాలు సబ్సిడీ భరిస్తూ.. రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నాయని పలువురు పేర్కొంటున్నారు. కేంద్ర రాష్ట్రాల మధ్య పొత్తు కుదరకపోవడంతోనే.. సన్నబియ్య క్రెడిట్ అంతా మాకే దక్కాలని ఇరు పార్టీలు కొట్లాడుతున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇలా ఎవరికి వారే ప్రచారాలు చేసుకోవడంతో ప్రజలు ఒకింత విస్మయానికి గురవుతున్నారు. ఎవరైతే మాకేంది. తినడానికి గింజలు వస్తున్నాయని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. పేదోడు తినడానికి ఇస్తున్న బియ్యం గురించి ఇరు పార్టీలు ఇంత రాద్ధాంతం చేస్తున్నాయని వాపోతుండటం గమనార్హం.

ఎవరెన్ని కిలోలు?



రేషన్ లబ్ధిదారులకు డీలర్లు అందజేస్తున్న రసీదు ప్రకారం.. 'ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన' పథకం కింద నలుగురు ఉన్న ఇంటికి తెల్లరేషన్ కార్డు ద్వారా 24 కిలోల బియ్యాన్ని రేషన్ దుకాణాల ద్వారా సరఫరా చేస్తున్నారు. అందులో 20 కిలోలు కేంద్రం వాటా ఉండగా.. మరో 4 కిలోలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది.

రాజీవ్ యువ వికాస్‌కు ప్రత్యేక కౌంటర్

మీర్‌పేట: రాజీవ్ యువ వికాస్ పథకానికి సంబంధించి పట్టణ పరిధిలోని నిరుద్యోగ యువత ఈ నెల 14వ తేదీలోపు మున్సిపల్ కార్యాలయంలోని ప్రజాపాలన కౌంటర్‌లో సూచించిన పత్రాలు అందజేయాలను కమిషనర్ జ్ఞానేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. యువత ఆన్‌లైన్ పోర్టల్ ద్వారానైనా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని లేదా కార్యాలయంలో కూడా కౌంటర్‌లో దాఖలు చేయొచ్చన్నారు. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని పట్టణ యువత సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని సూచించారు.

గడువు పొడిగింపు

కందుకూరు: రాజీవ్ యువ వికాస్ పథకం కింద ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న యువకులు వారి దరఖాస్తులను ఆన్‌లైన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని సంబంధిత సర్టిఫికెట్లతో జతచేసి ఈ నెల 14వ తేదీలోపు మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలని ఎంపీడీఓ సరిత బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, డ్రైవింగ్ లైసెన్స్, పట్టాదారు పాస్‌పుస్తకం, సదరం సర్టిఫికెట్ జిరాక్స్‌లతో పాటు పాస్‌పోర్టు సైజ్ ఫొటో దరఖాస్తుతో పాటు జతచేయాలన్నారు. రేషన్‌కార్డులు లేనివారు మాత్రమే ఆదాయ ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుందని, ఉన్నవారికి అవసరం లేదన్నారు. అర్హులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

పారదర్శకత పాటించాలని వినతి

బడంగ్‌పేట్: రేషన్‌షాపుల్లో పారదర్శకత పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ పార్టీ కార్పొరేషన్ 1, 2 అధ్యక్షులు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి, రామిడి వీరకర్ణారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం బీజేపీ నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలోని పేదల కోసం గరీబ్ కల్యాణ యోజక పథకాన్ని తీసుకొచ్చి తెల్లకార్డు కలిగిన ప్రతి పేద కుటుంబానికి రేషన్ దుకాణాల ద్వారా బియ్యంతో పాటు సరుకులు సరఫరా చేస్తున్నారని గుర్తు చేశారు. బాలాపూర్ మండలంలోని అన్ని రేషన్ దుకాణంలో ప్రధాని మోదీ చిత్రపటాన్ని ఉంచేలా చూడాలని కోరారు. అలాగే బాలాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని ఉంచినట్లుగానే ప్రధాని చిత్రపటాన్ని విధిగా ఉంచాలని కోరుతూ మోదీ చిత్రపటాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు నడికుడి యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు అనితప్రభాకర్, గూడెపు ఇంద్రసేన, నాయకులు నిమ్మల రవికాంత్‌గౌడ్, యాతం వెంకటేష్, సైదులు తదితరులు ఉన్నారు.



బాలాపూర్ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఎల్‌హెచ్‌పీఎస్ నాయకుల ముందస్తు అరెస్టు

కేశంపేట: లంబాడీ ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు ఇవ్వాలని డిమాండ్‌తో ముఖ్యమంత్రి ఇంటి ముట్టడికి లంబాడీ హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) పిలుపు ఇవ్వడంతో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు రాంబాల్‌నాయక్, దేవుజాలను పోలీసులు బుధవారం ముందస్తు అరెస్టు చేశారు. ముఖ్యమంత్రి ఇంటి ముట్టడికి వెళ్తున్న వారిని మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఉన్న పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.



పోలీసుల అదుపులో రాంబాల్‌నాయక్

రైతుల అభివృద్ధికి చర్యలు

సహకార సంఘం చైర్మన్ శేఖర్‌రెడ్డి

షాబాద్: రైతుల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని సహకార సంఘం చైర్మన్ చల్లా శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో నాందార్‌ఖాన్‌పేట్ గ్రామానికి చెందిన మేకల సరస్వతీ సహకార బ్యాంక్‌లో ఎల్‌టీ లోన్ తీసుకుంది. ఫిబ్రవరి నెలలో తన పాడి ఆవు ప్రమాదవశాత్తు మృతి చెందింది. దీంతో రైతుకు ఇన్సూరెన్స్ కింద రూ.95వేల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సహకార బ్యాంక్‌లో ఎల్‌టీ లోన్ తీసుకున్న ప్రతి రైతు పశువులకు ఇన్సూరెన్స్ చేస్తామని, దీంతో వారికి పాడి పశువులు మృతి చెందితే వారికి డబ్బులు వచ్చాయన్నారు. ఎల్‌టీ లోన్ తీసుకున్న ప్రతీ రైతు పశువులకు ట్యాగ్ వేయాలన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం సీఈఓ శివకుమార్‌రెడ్డి, నాయకులు రాంచందర్, మహేందర్ తదితరులు ఉన్నారు.



రైతుకు బీమా చెక్కును అందజేస్తున్న శేఖర్‌రెడ్డి

పాపన్నగౌడ్ ఆశయ సాధనకు కృషి

టీపీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్

చేవెళ్ల: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ మహారాజ్ ఆశయ సాధనకు కృషి చేయాలని టీపీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం వద్ద బుధవారం ఆయన 315వ వర్ధంతిని పురస్కరించుకొని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బహుజన ఆత్మగౌరవానికి ధీరత్వానికి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ప్రతీకగా నిలిచారని, సబ్బండ వర్గాలకు రాజకీయ, సామాజిక సమానత్వం కోసం ఎంతో కృషి చేసిన ఆయన చరిత్రలో నిలిచిపోయారన్నారు. ఆయన చూపించిన మార్గంలో ప్రతిఒక్కరూ నడవాలని సూచించారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాండుయాదవ్, నాయకులు ప్రకాశ్‌గౌడ్, బాలయ్య, జనార్ధన్, సాయికిరణ్, యాదగిరిగౌడ్ ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

షాబాద్: యువత సమాజ సేవలో పాలుపంచుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చేవెళ్ల స్వామి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చందనవెల్లి గ్రామంలో ఆకుల మనోహర్ జన్మదినం సందర్భంగా బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికుల కోసం వేసవి కాలంలో దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు పాల్గొని చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో న్యాయవాది బాలకిషన్, మహేందర్‌రెడ్డి, గోపాల్, రామస్వామి, నర్సింలు, వెంకటేశ్, రాంచందర్ ఉన్నారు.

బజరంగ్‌దళ్ నగర కమిటీ ఎన్నిక



షాద్‌నగర్: నూతన సభ్యులను సన్మానిస్తున్న బజరంగ్‌దళ్, వీహెచ్‌పీ నాయకులు

షాద్‌నగర్: పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో గల జగన్నాథస్వామి దేవాలయంలో బుధవారం విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) విభాగ్ సహ కార్యదర్శి మఠం రాచయ్య ఆధ్వర్యంలో బజరంగ్‌దళ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బజరంగ్‌దళ్ నూతన నగర కమిటీని ప్రకటించారు. నగర కమిటీ సంయోజక్‌గా కుమ్మరి వినయ్‌కుమార్, సహ సంయోజక్‌గా కుర్వగడ్డ భాను, విద్యార్థి ప్రముఖ్‌లుగా కొక్కు రాము, కొక్కు గణేష్, గోరక్ష సహ ప్రముఖ్‌లుగా ప్రేమ్‌కుమార్, విశ్వనాథ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు కండువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ బజరంగ్‌దళ్ విభాగ్ సంయోజక్ గూడెం రమేష్, నాగిళ్ల ప్రభాకర్, వీహెచ్‌పీ నగర అధ్యక్షుడు సందీప్‌కుమార్, నగర ప్రధాన కార్యదర్శి వాడ్యాల రుషికేశ్, మల్లికార్జునప్ప బజరంగ్‌దళ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మండల సంయోజక్‌గా విజయ్ పాండు

మొయినాబాద్: బజరంగ్‌దళ్ మండల సంయోజక్(అధ్యక్షుడి)గా విజయ్ పాండు ఎన్నికయ్యారు. బుధవారం మొయినాబాద్ శివాలయంలో బజరంగ్‌దళ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల సంయోజక్ విజయ్ పాండుతో పాటు సహ సంయోజక్‌లుగా శ్రీధర్, శ్రావణ్, విద్యార్థి ప్రముఖ్‌లుగా సాయి కోటి, నితిన్, బిందు, కిరణ్, సురక్ష ప్రముఖ్‌గా శివకుమార్, బలోపాసన ప్రముఖ్‌గా శివయాదవ్, గోరక్ష ప్రముఖ్‌లుగా నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్, భరత్ యాదవ్‌లను ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా సహ ప్రముఖ్ రమేశ్‌చారి, సురక్ష ప్రముఖ్ సురేశ్‌గౌడ్, బజరంగ్‌దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్షణ కల్పించాలని వినతి

కేశంపేట: ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్‌తో పాటు అతడి అనుచరుల నుంచి తనకు ప్రమాదం ఉందని, రక్షణ కల్పించాలని మండల పరిధిలోని కాకునూర్ గ్రామానికి చెందిన సొంటె శ్రీనివాస్ శంషాబాద్ డీసీపీకి బుధవారం ఫిర్యాదు చేశారు. గతంలో డీఎస్పీలో విశారదన్‌తో కలిసి పార్టీలో పని చేసినట్టు ఆయన ఫిర్యాదులో తెలిపారు. ఆ సమయంలోనే విశారదన్ విధానపరమైన తప్పులను, ఉద్యమం మాటున అతను చేస్తున్న ఆర్థికపరమైన అవకతవకల విషయంలో ఇద్దరికి విబేధాలు వచ్చాయన్నారు. ఇటీవల కాలంలో కొన్ని మీడియా ఛానల్స్‌కు ఇంటర్వ్యూలు ఇస్తున్న సందర్భంలో విశారదన్‌కు సంబంధించిన అనేక విషయాలను ప్రజలకు తెలిపానన్నారు. దీంతో విశారదన్ తన అనుచరులతో తనపై భౌతికదాడులు చేస్తామని బంధువులు, స్నేహితులకు ఫోన్లు చేసి పరోక్షంగా బెదిరింపులకు పాల్పడుతున్నట్టు పేర్కొన్నారు. విశారదన్‌తో పాటు అతడి అనుచరుల నుంచి తనకు ప్రమాదం ఉందని రక్షణ కల్పించాలని ఆయన కోరారు.



ఫిర్యాదును చూపుతున్న శ్రీనివాస్

PUBLIC CAUTION NOTICE

General public it is hereby cautioning that, my client **Sri Amboji Balaiah,** S/o. Late. Sri Sathaiah, aged about: 65 years, Occupation: Agriculture, R/o. H.No.5-43, Ravirala Village, Maheshwaram Mandal, Ranga Reddy District, has **entered Agreement of Sale** with **Sri V. Ponnala Ratnakar,** S/o. Veeraiah, R/o H.No.79/p, Massinfra, Thukkuguda Maheshwaram Mandal, Ranga Reddy District and also H.No. 3-6-106/a/401, Om Sri Sai Towers, Street No. 19, Himayat Nagar, Hyderabad, for purchasing the agricultural land Admeasuring Ac. 0-19. gts covered by survey number 389/ 3, Extent of Ac. 0-07 gts, in Sy. No. 389/ 5, Ac. 0-06 gts., and in Sy.No. 389/ 6, Ac. 0-06 gts., under pattadar Pass Book No. T05160252527, Khata No. 61260, same is situated at Thummalur Village, Maheshwaram Mandal, Ranga Reddy. That any one is having objection regarding above said agreement of sale can approach within two weeks in below mentioned office otherwise my client will entered Transaction of Registration of above said land. Hence the Caution Notice.

P. SRIKANTH REDDY
Advocate
3-44, Ravirala Vill, Maheshwaram Mandal, Ranga Reddy District-501510.
Phone No : 9492028755.
Date: 02-04-2025

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి విరాళం

నందిగామ: మండల కేంద్రమైన నందిగామలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయానికి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఎదిరే వెంకటయ్యగౌడ్ రూ.8లక్షల విరాళం ప్రకటించారు. బుధవారం ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులకు విరాళానికి సంబంధించిన చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతో చరిత్ర కలిగిన అయ్యప్ప ఆలయాన్ని పునర్నిర్మించడం చాలా గొప్ప విషయమన్నారు. ఆలయ నిర్మాణంలో భాగంగా గుడి పైకప్పు నిర్మించేందుకు రూ.8లక్షలు అవసరం అవుతున్నాయని తెలియడంతో ఆ డబ్బులను తాను విరాళంగా అందించినట్లు తెలిపారు. అనంతరం దాత వెంకయ్యను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గురుస్వాములు గిరిషన్ నాయర్, సుదర్శన్‌గౌడ్, అశోక్, ఈట గణేశ్, లక్ష్మయ్య యాదవ్, మాజీ సర్పంచ్ రాంరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యులు కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, దేపల్లి కుమార్‌గౌడ్, కృష్ణ, శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత

చేవెళ్ల: ఆధ్యాత్మిక చింతన ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని అర్చకుడు వాసుదేవాచార్యులు అన్నారు. మున్సిపాలిటీలోని హనుమాన్ దేవాలయంలో బుధవారం చేవెళ్లకు చెందిన హనుమాన్ భక్తులు హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్ మాలలు ధరించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హనుమాన్ దీక్షతో ఏకాగ్రత సిద్ధిస్తోందని, నిత్య పూజలతో భగవంతుడి అనుగ్రహం పొందుతారన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవాటు చేసుకోవాలని సూచించారు. హనుమాన్ దీక్ష తీసుకోవటం మంచి పరిణామమన్నారు. కార్యక్రమంలో రాఘవేందర్, జగదీశ్వర్‌రెడ్డి, విశ్వరూపచారి, చంద్రశేఖర్, వెంకటేశ్, నర్సింలు, సురేశ్, శ్రీపాల్, మహేందర్, సాయిగణేశ్, సురేందర్, నాగశివచారి తదితరులు ఉన్నారు.



హనుమాన్ దీక్ష తీసుకున్న భక్తులతో అర్చకుడు వాసుదేవాచార్యులు

బుగ్గరామేశ్వరస్వామి దేవాలయంలో పూజలు



నందిగోల ఊరేగింపులో భక్తులు

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతో ప్రతీ ఒక్కరికి మానసిక ప్రశాంతత కలుగుతుందని బుగ్గరామేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ వెంకటయ్య, వైస్ చైర్మన్ మాధవరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొమరబండ గ్రామంలో గల బుగ్గరామేశ్వరస్వామి దేవాలయం వద్ద నందిగోల ఊరేగింపు, అగ్ని గుండాల కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు సుభాశ్‌చంద్రబోస్, ఆలయ సభ్యులు, అర్చకులు, గ్రామస్తులు ఉన్నారు.

అతిథి గృహం.. నిరుపయోగం

- ఎనిమిదేళ్లుగా మూసి ఉన్న భవనం
- లక్షల ప్రజాధనం వృథా
- పట్టించుకోని అధికారులు



మొయినాబాద్ పంచాయతీరాజ్ అతిథి గృహం

మొయినాబాద్: లక్షల రూపాయల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన పంచాయతీరాజ్ అతిథి గృహం నిరుపయోగంగా మారింది. ప్రారంభించి సుమారు ఎనిమిదేళ్లు దాటినా ఎవరికీ ఉపయోగం లేకుండా ఎప్పుడూ తాళం వేసే ఉంటుంది. మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పాత మహిళా సమాఖ్య భవనానికి 2016లో మరమ్మతులు చేసి పంచాయతీరాజ్ అతిథి గృహంగా మార్చారు. అందుకోసం మండల పరిషత్ నుంచి రూ.10లక్షల వరకు ఖర్చు చేశారు. భవనానికి మరమ్మతులు చేయడంతో పాటు పూర్తిస్థాయి ఫర్నిచర్ ఏర్పాటు చేసి 2017లో అతిథి గృహాన్ని ప్రారంభించారు. కానీ ఆ గృహాన్ని వినియోగించింది మాత్రం లేదు. నాలుగైదుసార్లు అప్పటి జెడ్పీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు ఉపయోగించారు. తర్వాత అతిథి గృహానికి తాళం వేసి పెట్టారు. గత నాలుగు సంవత్సరాల నుంచి అతిథి గృహాన్ని తెరిచిందిలేదు. లక్షల రూపాయల ఖర్చుచేసి నిర్మించిన అతిథి గృహం నిరుపయోగంగా మారడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అతిథి గృహాన్ని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.